
టమోజ జ్యూస్ ప్యాక్టరీకి శంకుస్థాపన చేస్తున్న మంత్రి భరత్, కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే, తిక్కారెడ్డి

ఆగిన వైద్య కళాశాల

- పాలకులకు పట్టని ఆదోని మెడికల్ కాలేజీ
- ఆగిపోయిన పనులు
- బడ్జెట్‌లోనూ లేని ప్రస్తావన


ఆగిన మెడికల్ కళాశాల భవన నిర్మాణం

గత ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయదలచిన వైద్య కళాశాలల్లో ఆదోని వైద్య కళాశాల ఒకటి. కళాశాల నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయి. దీంతో కర్నూలు జిల్లా వాసుల కల ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం ఆ కళాశాల నిర్మాణ పనులపై శ్రద్ధ పెట్టడం లేదు. రాష్ట్ర బడ్జెట్‌లోనూ దాని ప్రస్తావన లేకపోవడంతో ఇప్పట్లో నిర్మాణాన్ని చేపట్టే ఆలోచన లేనట్లు కనిపిస్తోంది. దీనిపై పలు ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లా కేంద్రానికి ఆదోని పట్టణం వంద కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ప్రాంతంలో ఏవైనా ప్రమాదాలు జరిగినా అత్యవసర వైద్య సేవలు కావాలన్నా కర్నూలు వెళ్లాల్సి వస్తోంది. లేదంటే బళ్లారి, రాయచూర్ వెళ్లాల్సి ఉంటుంది. ఆదోని పట్టణంలోనే వైద్య కళాశాల ఏర్పాటు చేస్తే ఆలూరు, ఆదోని, కోసిగి, కౌతాళం, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం తదితర ప్రాంతాల ప్రజలకు ఎంతో దగ్గరగా ఉంటుంది. మెరుగైన సేవలు పొందటానికి వీలుగా ఉంటుంది. 2021 మే 31న రాష్ట్ర వ్యాప్తంగా 14 వైద్య కళాశాలలకు వర్చువల్ విధానంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆదోని శివారులో ఎమ్మిగనూరు వెళ్లే మార్గంలో అరేకల్ వద్ద వైద్య కళాశాల పనులకు శ్రీకారం చుట్టారు. 58 ఎకరాల విస్తీర్ణంలో వంద మెడికల్ సీట్లు, 450 పడకల సామర్థ్యంతో రూ.475 కోట్ల వ్యయంతో నిర్మిస్తామని ప్రకటించారు. 2023 చివరి నాటికి మెడికల్ కాలేజీని అందుబాటులోకి తీసుకు వస్తామని ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించింది. మూడేళ్లు గడిచినా ఇప్పటి వరకూ వైద్య కళాశాల నిర్మాణ పనులు పూర్తి కాలేదు. వైద్య కళాశాలకు సంబంధించి ఒక బ్లాకు మూడు ఫ్లోర్లు శ్లాబ్ వరకు పూర్తయింది. మరో బ్లాకు రెండు ఫోర్లు శ్లాబ్ వరకు పూర్తయింది. బాలికల హాస్టల్ ఆరు ఫ్లోర్లు, బాలుర హాస్టల్ రెండు ఫోర్లు శ్లాబ్ పనులు పూర్తయ్యాయి. కిచెన్ పనులు ఇంకా బేస్‌మెంట్ స్థాయిలోనే ఉన్నాయి. అత్యవసర విభాగం, ఇఎస్ఎస్ 1, 2 పనులు కూడా ఇంకా బేస్‌మెంట్ స్థాయిలోనే ఉన్నాయి. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం ఆదోని వైద్యశాల నిర్మాణ పనులు ఆపేసింది. ఆదోని వాసుల కలగా ఉన్న వైద్య కళాశాల నిర్మాణ పనులు ఆపేయడంపై పలు ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రవేశపెట్టన రాష్ట్ర బడ్జెట్‌లోనూ ఆదోని వైద్య కళాశాలకు నిధులు కేటాయించలేదు. అసలు ప్రస్తావన కూడా చేయలేదు. దీంతో ఇక ఆదోని వైద్య కళాశాల ఆగిపోయినట్లేనని చర్చ సాగుతోంది. పబ్లిక్ ప్రయివేటు పార్టనర్‌షిప్ (పిపిపి) విధానంలో ఆదోని వైద్య కళాశాల పనులు చేపట్టాలని టిడిపి ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. "ఆదోని వైద్య కళాశాల నిర్మాణ పనులను తాత్కాలికంగా మాత్రమే ఆపేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. పిపిపి విధానంలో నిర్మాణ పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. దానిపై ఇంకా చర్చ జరుగుతోంది. ప్రభుత్వం నుంచి వచ్చే ఉత్తర్వుల ఆధారంగా నిర్మాణ పనులు కొనసాగుతాయి.' అని ఎపిఎంఎస్ఐడిసికి చెందిన ఒక అధికారి తెలిపారు.

వెంటనే పనులు పున: ప్రారంభించాలి

- కె.శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు.



ఆదోని వైద్య కళాశాల నిర్మాణ పనులను వెంటనే పున: ప్రారంభించాలి. అత్యంత వెనుకబడిన ప్రాంతమైన ఆదోనిలో ప్రభుత్వ వైద్యకళాశాల వచ్చిందని ప్రజలందరూ ఆనందం వ్యక్తం చేశారు. వైద్య కళాశాల నిర్మిస్తే దానికి అనుబంధంగా ఆస్పత్రి కూడా నిర్మాణం జరుగుతుంది. దాని ద్వారా కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం వాసులకు మెరుగైన వైద్యం అందేది. వాటిని నీరు గార్చేలా ప్రభుత్వం వైద్య కళాశాలను ఆపేయడం సరికాదు.

6 నెలల్లో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ పూర్తి

- రాష్ట్ర మంత్రి టిజిభరత్

ప్రజాశక్తి-పత్తికొండ

ఆరు నెలలో ఇంటిగ్రేటెడ్ టమోట ప్రాసెసింగ్ యూనిట్ అందుబాటులోకి తెచ్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి. భరత్ తెలిపారు. శుక్రవారం పత్తికొండ మండలం, దూదేకొండ రెవెన్యూ గ్రామం, కోతిరాళ్ళ గ్రామ పంచాయతీ వద్ద రూ.11 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి శంకుస్థాపన చేశారు. మంత్రి టిజి భరత్ మాట్లాడుతూ టమోట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కర్నూలు ఎంపీ, పత్తికొండ ఎమ్మెల్యే కెఈ శ్యామ్ కుమార్ ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారని, అందుకు సంబంధించిన పనులు చేయాలని సిఎం ఆదేశాల మేరకు పనులకు శంకుస్థాపన చేశామని అన్నారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు నిధులు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు ఆరు నెలలోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సిఇఒ, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు రూ.11 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 32 మందికి ప్రత్యక్ష ఉపాధి, 100 మందికి పరోక్ష ఉపాధి ఉంటుందన్నారు. టమోట కెచప్, టొమాటో పేస్ట్, టొమాటో పికిల్ లాంటి ఉత్పత్తులు తయారు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఏ రకమైన బాటిల్ లో అయినా కెచప్ ఒకటే రకంగా ఉంటుందని, ఇక్కడ టమోట పంట పండించే రైతులతో మాట్లాడి ప్రత్యేకమైన జిన్‌తో టమోట పంట పండిస్తే అదే రకమైన కెచప్ లాగా ఉండడంతో పాటు నాణ్యత కూడా ఉండడంతో సేల్ చేసుకునే దానికి ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు.. రైతులకు అటువంటి విషయాల గురించి వారిలో అవగాహన కల్పించాలని కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. టమోట పల్ప్ చేసినట్లయితే రోజు 10 నుండి 15 మెట్రిక్ టన్నులు చేయవచ్చునన్నారు. డీహైడ్రేషన్‌కు ఐతే రోజు 5 మెట్రిక్ టన్నులు చేయవచ్చన్నారు.. ఒకవేళ టమోట పంట లేని పక్షంలో మామిడి, బనానా, పప్పయ్య, జామ పండ్లను ప్రాసెస్ చేసుకోవచ్చున్నారు. వలసలు నివారించి పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ లో చాలా మేరకు పెద్ద ఎత్తున్న పరిశ్రమలు రానున్నాయన్నారు. కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ నిమిత్తం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పత్తికొండకు వచ్చిన సందర్భంగా మన ప్రాంతానికి టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరామని, ఆ మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రూ. 11 కోట్లతో టమోటా ప్రాసెస్ యూనిట్ కు శంకుస్థాపన జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో టమోటో పంట రూ.లక్ష 20 వేల ఎకరాలలో పంట సాగు చేస్తే 7,900 హెక్టార్ల పంట మన జిల్లాలో సాగు అవుతుందన్నారు. 30 నుండి 40 శాతం పంట సాగు పత్తికొండలో అవుతుందన్నారు.. రేట్ ఉన్నపుడు మార్కెట్ లో అమ్ముకున్నప్పటికీ, మిగతా రోజులలో వాటిని ప్రాసెసింగ్ చేసి వివిధ రకాల ఫార్మాట్ లకు మార్చి వాటిని మార్కెటింగ్ చేసేందుకు వీలుగా ఈ యూనిట్ ను ఏర్పాటు చేయబోతున్నాం అన్నారు. జిల్లాలో అనేక రకాల యూనిట్ లను తీసుకొని రావాలని కలెక్టర్ మంత్రిని కోరారు. పత్తికొండ ఎమ్మెల్యే కెఇ. శ్యాంబాబు మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గంలో రైతులు ఎక్కువగా టమోటా పంటను సాగు చేస్తూ ఉంటారన్నారు. ఈ యూనిట్ 6 లేక 7 నెలలు పూర్తి చేస్తామని మంత్రి తెలియజేయడం చాలా సంతోషమన్నారు. ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సిఇఒ డా.గెడ్డం శేఖర్ బాబు , వాల్మీకి సంఘం చైర్మన్ బొజ్జమ్మ, పత్తికొండ ఆర్‌డిఒ భరత్, జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిని లోకనాథ్, టిడిపి నాయకులు సాంబశివరెడ్డి, తుగ్గలి నాగేంద్ర, ఎమ్మార్వో రమేష్, కెపిఆర్ మైత్రి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మగాళ్లే.. ఆడాళ్లై..!

- హోలీ వేడుకలంటేనే ఆ గ్రామంలో హాస్యం
- మగువళ్లా.. మగాళ్లు... - హోలీ నాడు జంబలకిడి పంబ
- అక్కడ ఆ రెండు రోజులు అంతే..!

వార్త మెయిన్‌లో

చిన్న, పెద్ద, పేద, ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరూ హోలీ పండగను ఆనందోత్సవాల నడుమ జరుపుకుంటారు. హోలీ రోజు ఎవరైనా రంగులు చల్లుకుంటారు. హోలీ నాడు చాలా ప్రాంతాల్లో అనేక వింత ఆచారాలను కొనసాగిస్తున్నారు. హోలీ అంటే కాముని దహనం.. రంగులు చల్లుకోవడం... ఇదే కదా..! కానీ అక్కడ మాత్రం ప్రత్యేకం. ఓ వింతైన ఆచారం కొనసాగుతోంది. హోలీ వచ్చిందంటే చాలు 'జంబలకిడిపంబ' సినిమాలోలాగా మగాళ్లు ఆడవారైపోతారు.

పన్నులు కట్టిన వారికి తాగునీరివ్వండి

- నగరంలో సమస్యలు పరిష్కరించండి

- ప్రజాచైతన్య యాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రెగ్యులర్‌గా పన్నులు చెల్లించే కాలనీలకు కనీసం తాగునీరివ్వండని, కర్నూలు నగర ప్రజల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి నగరపాలక సంస్థ అధికారులను హెచ్చరించారు.కర్నూలు నగరంలో నగరపాలక సంస్థ పాలన చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుందని, బాగా పన్నులు కట్టే ఎన్‌ఆర్‌పేట, కొత్తపేట, నర్సింగరావుపేట లాంటి ప్రాంతంలో కూడా తాగడానికి మంచినీళ్ల కోసం కటకటాలాడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. సిపిఎం ఓల్డుసిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ చేపట్టిన ప్రజా చైతన్య యాత్రను గౌస్‌దేశాయి ప్రారంభించి మాట్లాడారు. ప్రజల దగ్గరికి వెళ్లి ప్రజా సమస్యలు అడుగుతుంటే ప్రజలు కన్నీరు మున్నీరవు తున్నారన్నారు. సొంత ఇంటిలో ఉండికూడా అద్దె ఇంటిలో ఉన్నట్లు ఉందని ప్రజలు వాపోయారని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డిని ఉదయం లేచినప్పటి నుండి సాయంత్రం దాకా విమర్శలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతంలో ఇంటి పన్నులు పెంచుతూ జగన్ తెచ్చిన జీవోలను ఎందుకు రద్దు చేయలేదని ప్రశ్నించారు. నగరపాలక సంస్థకు రెగ్యులర్‌గా పన్నులు కట్టే మధ్యతరగతి ప్రజలు ఉన్న ప్రాంతాల్లో తాగునీటికి కటకటాలాడుతున్నారంటే నగరపాలక సంస్థ పాలన ఎలా ఉందో అర్థం అవుతుందన్నారు. పన్నులు వసూలు చేయడానికి పెట్టే శ్రద్ధ ప్రజల కనీస అవసరాలు తీర్చడంలో ఏ మాత్రం కనపరచడం లేదన్నారు. ఒకవైపు విద్యుత్ భారాలు, మరోవైపు ఇంటి పన్నుల భారారు భరించలేక ప్రజలు సతమతమవుతున్నారన్నారు. ఈ మధ్యకాలంలో క్యాబ్ ఆటోలు ఆగడంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయిందన్నారు. మాకు రేషన్ కార్డులు లేవని కొందరు, మాకు సొంత ఇల్లు లేదు, కాస్త ఇంటి స్థలం ఇచ్చే నాథుడే లేదని మరికొందరు, ఇంటి పన్నుల కోసం వెళితే లంచాలు అడుగుతున్నారని మరికొందరు ప్రజలు సిపిఎం కార్యకర్తల ముందు వాపోయారని తెలిపారు. టిడిపి కూటమి వచ్చిన తర్వాత లంచాలు లేనిదే ఒక్క పని కూడా జరగడం లేదని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ఓట్లు అడగడానికి ఇంటింటికి తిరిగిన నాయకులు ఇపుడు తిరిగి చూడలేదని, మాగోడు ఎవరికి చెప్పుకోవాలని ప్రజలు అంటున్నారన్నారు. ఇలాంటి సందర్భంలోనే సిపిఎం పార్టీ తన బాధ్యతగా భావించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజల దగ్గరికి వెళ్లి ప్రజా చైతన్యాన్ని కల్పించి ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేలా కృషి చేస్తుందన్నారు. ఇంటి పన్నులు, కరెంట్ చార్జీలు తగ్గించడానికి, నగరపాలక సంస్థ అదనపు కార్మికుల పెట్టి పేరుకుపోయిన చెత్త ఎత్తివేసేలా ఒత్తిడి చేయడం కోసం ఈ యాత్రను చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థకు సరిపడా తాగునీటి వసతులు కల్పించాలన్నారు. ఎప్పుడో 2007-08లో ఆరోజు సిపిఎం ఎమ్మెల్యే గఫూర్ నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకులు తప్ప పెరిగిన జనాభాకు తగ్గట్టుగా నీటి సౌకర్యాలు కల్పించడంలో నగరపాలక సంస్థ వైఫల్యం చెందిందన్నారు. రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కట్టండి మహాప్రభు అంటే దాని గురించి కనీసం ఆలోచన చేసే సమయం కూడా వీరికి లేదని విమర్శించారు. మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం కోసం తక్షణం చర్యలు చేపట్టకపోతే నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ప్రజలతో ముట్టడిస్తామని హెచ్చరించారు. సిపిఎం నగర నాయకులు అబ్దుల్లా, రామకృష్ణ, మదిలేటి, మహేష్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



నాయకులకు సమస్యలు విన్నవిస్తున్న మహిళ


సమావేశంలో మాట్లాడుతున్న పాలకవీటి విజయకుమార్

నాయి బ్రాహ్మణుల అభివృద్ధే ధ్యేయం

నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాలకవీటి విజయకుమార్

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

నాయి బ్రాహ్మణుల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాలకవీటి విజయకుమార్ అన్నారు. గొల్లపూడిలోని బిసి సంక్షేమ భవనంలో ఏర్పాటుచేసిన నాయి బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి సంస్థ ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదరణ-3 పథకానికి 2025-2026 బడ్జెట్లో రూ.1000 కోట్లు కేటాయించిందని,సెలూన్ షాపులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ కోసం రూ.150 కోట్లు నిధులు కేటాయించడం సంతోషకరమని అన్నారు. దేవాలయాల్లో పాలకమండలి సభ్యులుగా నాయి బ్రాహ్మణులకు అవకాశం కల్పిస్తామని చెప్పడం గర్వించదగ్గ విషయమని అన్నారు. తీర్మానంలో మాట్లాడుతూ నాయి బ్రాహ్మణ కులవృత్తి చేసుకునే వారి పైన వాయిద్య కళాకారుల పైన అకారణంగా కులం పేరుతో తిట్టడమే కాకుండా వారి పైన దాడులు చేస్తున్నారని అందుకే రక్షణ చట్టం కల్పించాలని కోరామన్నారు. నాయి బ్రాహ్మణ కమిటీ హాల్స్ నిర్మాణం కోసం ప్రతి మండలంలో స్థలం కేటాయించాలని కోరామని తెలిపారు. దేవాలయంలో ఖాళీగా ఉన్న మంగళ వాయిద్య కళాకారుల పోస్టులు భర్తీ చేయాలని, ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులు, పోలీస్ శాఖ బ్యాండ్ విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరామని విజయకుమార్ తెలిపారు. మున్సిపాలిటీలు, నగరాలలో, పంచాయతీలో ఏర్పాటుచేసిన షాపింగ్ కాంప్లెక్స్‌లో నాయి బ్రాహ్మణులకు రాయితీలతో షాపులు కేటాయించాలని ఆదరణ పథకం ద్వారా ఇచ్చే పనిముట్లు ప్రస్తుత పరిస్థితులు అనుగుణంగా ఆధునిక పరికరాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశామన్నారు. ప్రతి జిల్లాలో వాయిద్య కళాకారులకు స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ కేంద్రాల ద్వారా ఉత్తమ నైపుణ్యాలు పెంచడానికి చర్యలు తీసుకోవాలని అదేవిధంగా మహిళలకు బ్యూటీ పార్లర్లుకు, టైలరింగ్ ,అల్లికలకు, నైపుణ్యం పొందడానికి చర్యలు తీసుకోవాలని కోరమన్నారు. కార్పొరేషన్ల ద్వారా రూ.ఐదు లక్షల సబ్సిడీతో కూడిన రుణాలు ఇవ్వాలని, 50 యేళ్లు దాటిన నాయి బ్రాహ్మణ వాయిద్య కళాకారులకు ప్రతినెల రూ.5000 పెన్షన్ ఇవ్వాలని, బార్బర్ షాప్‌లో పనిచేస్తున్న నాయి బ్రాహ్మణ వృత్తి దారులకు ఉచిత బీమా కల్పించాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఉమాదేవి నియోజకవర్గ రాష్ట్ర డైరెక్టర్లు పాల్గొన్నారు.

నాటుసారా తయారీ నిర్మూలిద్దాం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

నాటుసారాను ప్రభుత్వం నిషేధించిందని, దాని నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా ఉన్నతాధికారి ఎం సుధీర్ బాబు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా కార్యాలయంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రచార రథాన్ని పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నవోదయం టు పాయింట్‌లో భాగంగా నాటుసారా రహిత గ్రామాల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన నాటు సారా నిర్మూలన కార్యక్రమం కోసం ప్రజలందరినీ భాగస్వాములను చేయాలన్న ఉద్దేశంతో ప్రచార రథం ద్వారా నాటు సారా పై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. నాటు సార తయారీ నేరమని, దాన్ని తయారు చేసేవారు మానివేయాలని, లేదంటే ఊచలు లెక్కించాల్సి వస్తుందని హెచ్చరించారు. నాటు సారా తయారీ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఇఎస్ , రాజశేఖర్ గౌడ్, రామకృష్ణారెడ్డి సిఐలు చంద్రహాస్, జయరాం నాయుడు , ఎస్ఐలు దుర్గా నవీన్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.


జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారి సుధీర్‌బాబు

ఆర్‌టిసి ప్రయివేటీకరణ ఆపాలి


విద్యుత్ బస్సుల పేదర ప్రయివేటీకరణ

ఆర్‌టిసి సంస్థలను కాపాడండి

మార్చి 24న చలో ఢిల్లీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆర్‌టిసిలో నేరుగా విద్యుత్ బస్సులను నిర్వహించుకునే అవకాశం, బడ్జెట్ కేటాయింపులు చేయాలని, ప్రైవేటు విద్యుత్ బస్సుల కన్సార్టియంల పేరుతో ఆర్టీసీల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, దేశంలోని రవాణా రంగ కార్మికులకు ఒక సమగ్ర సంక్షేమ చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ మార్చి 24న చలో పార్లమెంట్ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఎపిఎస్ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ , ఆంధ్రప్రదేశ్ ఎఐఆర్‌డిబ్ల్యుఎఫ్ పిలుపునిచ్చాయని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం కార్మిక కర్షక భవన్‌లో జరిగిన ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా కమిటీ సమావేశం జె.దివాకర్ మాట్లాడారు. చలో ఢిల్లీ కోసం ఇప్పటకే వివిధ జిల్లాల నుండి రిజర్వేషన్లు చేసుకున్నారన్నారు. దేశంలోని వివిధ ఆర్‌టిసిల నుండి పెద్ద సంఖ్యలో ఉద్యోగ కార్మికులు చలో ఢిల్లీ నిరసన కార్యక్రమానికి హాజరవుతున్నారని తెలిపారు. మన రాష్ట్రంలో విద్యుత్ బస్సుల పాలసీని 2018లో ప్రవేశపెట్టిన ఈ ప్రభుత్వం తిరిగి దానిని 2024 డిసెంబర్ 11న పునరుద్ధరించిందన్నారు. 2029 నాటికి మొత్తం ఆర్‌టిసిలో విద్యుత్ బస్సులతో నింపాలని సుస్థిర విద్యుత్ వాహనాల పాలసీ-4లో లక్ష్యంగా పెట్టారు. ఇది ఎపిఎస్ఆర్‌టిసికి అశనిపాతం వంటిదని తీరని నష్టం చేస్తున్నారు. ఆర్‌టిసి యాజమాన్యం కూడా విద్యుత్ బస్సులను ప్రవేశపెడతామని పదేపదే పత్రికలలో ప్రకటనలు చేస్తుందన్నారు. విద్యుత్ బస్సుల పేరుతో మొత్తం ఆర్‌టిసి మహా సంస్థను ప్రైవేటు కార్పొరేటర్లకు అప్పజెప్పాలని నిర్ణయించవద్దని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలు ఆర్టీసీల విస్తరణకు పెను ప్రమాదంగా దాపురించాయన్నారు. ఆర్‌టిసి బస్సుల స్థానంలో దేశవ్యాప్తంగా విద్యుత్తు బస్సులను తెచ్చి భవిష్యత్తులో ఆర్‌టిసిలను కనుమరుగు చేయాలని కేంద్ర ప్రభుత్వ పథకం వేసిందన్నారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన పిఎం- ఈ బస్సు స్కీం కూడా ఇందులో భాగమేన్నారు. ఆర్‌టిసి అధికారులతో పాటు యాజమాన్యం కూడా కేంద్ర ప్రభుత్వ అధికారులతో దపదపాలుగా చర్చలు జరిపారన్నారు. కేంద్రం తెచ్చిన కొత్త ఎంవి సవరణ చట్టం ఆర్‌టిసిలకు, రవాణా రంగానికి పెను ప్రమాదమన్నారు. లాస్ట్ మెయిల్ కనెక్టివిటీ, ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్, కొత్త మోటార్ వాహన చట్టం స్క్రాపింగ్ పాలసీ వంటి అంశాలు ఆర్టీసీల పాలిట ప్రమాదంగా దాపురించాయన్నారు. వీటికి తోడు విద్యుత్ బస్సులు పేరుతో ఆర్టీసీ బస్సుల తొలగింపు ప్రమాదం ముందుకు వచ్చిందన్నారు. ఈ విద్యుత్ బస్సుల ముసుగులో ప్రైవేటీకరణకు నిర్దేశించిన కాల పరిమితి కూడా నాలుగైదేళ్లు మాత్రమేనన్నారు. ఆర్‌టిసి బస్ స్టేషన్ల స్థలాలను కూడా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నగదీకరణ ప్రాజెక్టులో చేర్చారన్నారు. నీతి ఆయోగ్ వంటి సంస్థ వీటికి పథకం రూపొందించిందన్నారు. తిరుపతి ,ప్రకాశం జిల్లాలలో సదస్సులు జరిగాయన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, ఆర్టీసీ జోనల్ చైర్మన్లు, వివిధ ప్రజాప్రతినిధులకు విద్యుత్ బస్సుల సమస్యలపై మెమోరాండాలు ఇచ్చి ప్రాతినిధ్యం చేయాలని ఎస్‌డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. చలో ఢిల్లీ కార్యక్రమంలో ఈ రాష్ట్ర రవాణా రంగ కార్మికులతో పాటు ఎపిఎస్ఆర్‌టిసి ఉద్యోగ కార్మికులు పాల్గొనాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ కోరింది. ఈ సమావేశంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎండి అంజిబాబు, కడపజోనల్ అధ్యక్షులు ఆర్.అజీమ్‌ఖాన్, జిల్లా కార్యదర్శి వివిఎస్. రాయుడు, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జె.దివాకర్, వేదికపై ఎంజి.అంజిబాబు

టిడిపి నేత దారుణ హత్య

-30వ వార్డు కార్పొరేటర్ తండ్రి సంజన్న-షరీన్‌నగర్ లో కలకలం రేపిన ఘటన


-పాత కక్షలే కారణమా? -పోలీసుల విచారణ



ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్: కర్నూలు 30 వార్డు కార్పొరేటర్ జయరాముడు తండ్రి టిడిపి నేత సంజన్నను దారుణంగా హత్య చేసిన ఘటన శుక్రవారం రాత్రి శ్రీనగర్ లో చోటుచేసుకుంది. దీంతో కాలనీలో కలకలం రేపింది.ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. శుక్రవారం రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో సంజన్న నివసిస్తున్న శరీఫ్ నగర్‌లోని మందిరం గూడేకల్లు అల్లిపీర స్వామి మందిరానికి ప్రార్థన చేసుకోవడం కోసం ప్రతి శుక్రవారం వెళ్లేవాడు. ఈ నేపథ్యంలో బైకు మందిరం ముందర ఆపి లోపలికి వెళ్లే ప్రయత్నం చేస్తుండగా హఠాత్తుగా కొంతమంది గుర్తుతెలియని దుండగులు ఒక్కసారిగా కత్తులతో దాడి చేసినట్టు తెలుస్తోంది. దుండగులు పథకం ప్రకారం ముందస్తుగానే ప్రణాళిక రచించి ఈ దాడికి తెగబడినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ హత్య వెనక పాత కక్షలు కారణమై ఉండొచ్చని చర్చ జరుగుతోంది. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలనుంది.

పెరవలిలో ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-మద్దికేర



పెరవలిలోటిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టి రామారావు విగ్రహ ఆవిష్కరణకు చేసినట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కా రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పెరవలిలో ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణలో భాగంగా ఎంపి బస్తిపాటి నాగరాజు, పత్తికొండ ఎమ్మెల్యే కెఇ. శ్యాం బాబు, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ పార్టీ స్థాపించిన తొమ్మిది నెలలకే ముఖ్యమంత్రి అయి గిన్నిస్ బుకాఫ్ రికార్డు సృష్టించిన నాయకుడు ఎన్‌టిఆర్ అన్నారు. ఆస్తిలో మహిళలకు సమాన హక్కు కల్పించాలని, రెండు రూపాయలకు కిలో బియ్యం, రాజకీయ పదవుల్లో బిసిలకు ఉన్నతమైన స్థానాలు కల్పించిన ఘనత ఎన్టీ రామారావు కే దక్కుతుందన్నారు. అనంతరం యం.అగ్రహారం లో వాటర్ ట్యాంక్ సీసీ రోడ్లు ప్రారంభించారు,. అగ్రహారం గ్రామానికి వాటర్ సదుపాయం లేకపోయినందున్న ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్ చొరవతో 57.22 లక్షల నిధులతో వాటర్ ట్యాంక్ నీ నిర్మించి వాటర్ సప్లైని ట్యాప్ ద్వారా నీళ్ల వదిలి ప్రారంభించినట్లు తెలిపారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కష్ణ గుడి నుండి పోస్ట్ ఆఫీసీ వరకు, పోస్ట్ ఆఫీస్ నుండి ఎస్‌డబ్ల్యుఎం షెడ్ వరకు రూ.30 లక్షల నిధులులతో సిసి రోడ్లు ప్రారంభించారు. టిడిపి రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, వివిధ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ కార్యదర్శి నవీన్

వాలంటీరు వ్యవస్థను కొనసాగించాలి

- 17న చలో విజయవాడను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వాలంటీరు వ్యవస్థను కొనసాగించాలని ఎపి గ్రామ/వార్డు వాలంటీరు యూనియన్ గౌరవాధ్యక్షులు సురేష్, కార్యదర్శి నవీన్, సిఐటియు మండల కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాలంటీర్లకు రూ.5 వేల నుంచి రూ.10 వేల గౌరవ వేతనం ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాలంటీర్ల గురించి పట్టించుకోవడం లేదని చెప్పారు. వారిని విధుల్లోకి తీసుకుని, వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ నెల 17న చలో విజయవాడలో మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఎపి గ్రామ/వార్డు వాలంటీర్ యూనియన్ నాయకులు రవి, కుమార్, లోకనాథ్, రమేష్, గఫూర్, నవీన్, హుస్సేన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


ఆర్థిక సాయం అందిస్తున్న మదిరె భాస్కర్ రెడ్డి

రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని టిడిపి సీనియర్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మదిరె భాస్కర్ రెడ్డి భరోసా ఇచ్చారు. మండలంలోని పాండవగల్ దగ్గర రెండు, మూడు రోజుల క్రితం కర్ణాటక బస్సు రోడ్డు ప్రమాదంలో చనిపోయిన కుప్పగల్ గ్రామానికి చెందిన కురువ ఈరన్న, కురువ ఆదిలక్ష్మి కుమార్తెను, కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. సౌదీ రావుఫ్, మాజీ కౌన్సిలర్ రామచంద్ర, టిడిపి సీనియర్ నాయకులు బుద్ధారెడ్డి, చిన్నగోనెహాళ్ గోపాల్ రెడ్డి, షాషావలీ, మల్లేశ్వరప్ప, రాముడు, చాంద్, తాయారు, దాదా పాల్గొన్నారు.

చక్కని చేతిరాతతో మంచి భవిష్యత్తు

- ప్రిన్సిపల్ షాహిన పర్వీన్

ప్రజాశక్తి - గోనెగండ్ల


హ్యాండ్ రైటింగ్ ట్రైనర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మంచి చేతిరాతను నేర్చుకోవడం ద్వారా విద్యార్థులు భవిష్యత్తును మార్చుకోవచ్చని గోనెగండ్ల ఎపి మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ షాహిన పర్వీన్ తెలిపారు. శుక్రవారం ఎపి మోడల్ పాఠశాలలో విద్యార్థులకు లుసిడా హ్యాండ్ రైటింగ్ ట్రైనర్ రాజశేఖర్‌తో ఒక్కరోజు హ్యాండ్ రైటింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పిల్లల చదువు కేవలం చదవడంలోనే కాకుండా చక్కటి చేతిరాత ద్వారా కూడా వారి మానసిక నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులకు అందమైన చేతిరాత ద్వారా భవిష్యత్తులో చాలా ఉపయోగాలు ఉన్నాయన్నారు. ఒకరోజు శిక్షణలోనే విద్యార్థులకు చక్కటి చేతిరాత నేర్పిన ట్రైనర్ రాజశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపి శాలువా, పూలమాలతో సన్మానించారు.

ఎమ్మెల్యే సహకారంతో బోరు ఏర్పాటు

- కృతజ్ఞతలు తెలిపిన ఎర్రబాడు గ్రామస్తులు

ప్రజాశక్తి - గోనెగండ్ల


బోరు వేయిస్తున్న టిడిపి నాయకులు

గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రం కావడంతో టిడిపి నాయకులు, గ్రామస్తులు ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే బీవీ గ్రామంలో బోరు వేయడానికి అవసరమైన బోరు బండిని పంపారు. శుక్రవారం బోరు వేయగా బోరులో సుమారు మూడు ఇంచుల నీరు వచ్చాయి. నీటి సమస్య తీరనుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే బీవీకి కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి నాయకులు శ్రీనివాసులు, మౌలా, షేక్షావలీ, తిరుమల గౌడ్, ఏసయ్య, రఘు, కుమార్ పాల్గొన్నారు.

రోడ్లు అధ్వానం.. డ్రైయినేజీ అస్తవ్యస్తం

- ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం నాయకులు


ప్రజాశక్తి - దేవనకొండ

రాష్ట్రంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, డ్రైయినేజీలు అస్తవ్యస్తంగా తయారయ్యాయని సిపిఎం నాయకులు తెలిపారు. శుక్రవారం మండలంలోని కుంకునూరు గ్రామంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కెవి.నారాయణ, బి.వీరశేఖర్ మాట్లాడారు. రాష్ట్రంలో గత పదేళ్ల నుంచి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ప్రజా సమస్యలను గాలికి వదిలేశాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఆకాశాన్నంటిన ధరలు, పెరుగుతున్న విద్యుత్ భారాలు, గ్రామీణ ప్రాంతాల్లో అధ్వానమైన రోడ్లు, డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, సిసి రోడ్లు లేవని తెలిపారు. తాగు, సాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా చైతన్య యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈ యాత్రలో ప్రజలు పాల్గొని సమస్యలు తెలియజేయాలని కోరారు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలోనైనా ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని.. బడ్జెట్‌లో రాయితీలు ప్రకటిస్తారని 9 నెలలుగా ఆశతో ఎదురుచూసిన ప్రజలకు నిరాశ మిగిలిందని మండిపడ్డారు. ప్రభుత్వం చెప్పే మాటలకు.. చేతలకు పొంతన లేదని, విద్యుత్ చార్జీలు ఒక రూపాయి పెంచనని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల నుంచే విద్యుత్ భారాలు వేయడం మొదలుపెట్టారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు పగలగొట్టండన్న చంద్రబాబు గుట్టుచప్పుడు కాకుండా స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని తెలిపారు. హంద్రీనీవా పెండింగ్ పనుల పూర్తి, పంట కాలువ నిర్మాణం, గుండ్లకొండ దగ్గర స్లూయిస్ ఏర్పాటు పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. సాగు, తాగునీరు, మౌలిక సదుపాయాలపై ప్రభుత్వాల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ప్రజా చైతన్య యాత్రలో వచ్చిన సమస్యలపై ఈనెల 28న మండల కేంద్రంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎం.అశోక్, స్థానిక నాయకులు కె.శ్రీనివాసులు, సింహాద్రి, వెంకటేశ్వర్లు, వీరేంద్ర, సూర్యచంద్ర పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలం పెద్దతుంబలం గ్రామంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఎస్ఎస్ ట్యాంకు వెడల్పు చేయాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి లింగన్న మాట్లాడుతూ... గ్రామంలో 5 నుంచి 6 రోజులకు మాత్రమే తాగునీరు సరఫరా అవుతున్నాయని తెలిపారు. స్థానికంగా రోడ్లు, డ్రైయినేజీ, మురుగుదొడ్ల సమస్యలు, చివరి కాలనీ 4వ వార్డులో విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, నాగప్ప కట్ట దగ్గర వీధి దీపాలు వేయాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శివర్గ సభ్యులు రామాంజనేయులు, మండల కమిటీ సభ్యులు హనుమంతు రెడ్డి, శాఖ కార్యదర్శి హనీఫ్, సిపిఎం సీనియర్ సభ్యులు దాసప్ప నాయుడు, పార్టీ సభ్యులు ఖాజా, భీమా, నర్సిరెడ్డి, హనుమంతు రెడ్డి, హుస్సేని, రమేష్, తాయన్న, కొండయ్య పాల్గొన్నారు.

ఆదోని : పట్టణ శివారులో ఉన్న మైనార్టీ కాలనీ వైపు అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో స్థానికులు సమస్యల వలయంలో చిక్కి ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ కమిటీ సభ్యులు వీరేష్, ఖాన్, నాయకులు ఇక్బాల్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మైనార్టీ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మైనారిటీ కాలనీ ఏర్పడి సుమారు 20 ఏళ్లవుతోందని, కాలనీకి వెళ్లడానికి ప్రధాన రోడ్డు లేదని తెలిపారు. కాలనీలో సుమారు 200 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని చెప్పారు. నివాసాల మధ్యలోనే చెత్తాచెదారం, ముళ్లపొదలు విస్తరించి ఉన్నాయన్నారు. పాములు, విష పురుగులు ఆవాసంగా చేసుకొని సంచరిస్తున్నాయని తెలిపారు. వాటితో కలిసి జీవనం సాగించాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఉందని మండిపడ్డారు. గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్న అంగన్వాడీ కేంద్రానికి వెళ్లాలంటే రెండు కిలోమీటర్లు నడవాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. కాలనీకి సరఫరా అవుతున్న తాగునీటి పైపులైన్ నిత్యం లీకేజీలతో నీరు వృథా అవుతోందని చెప్పారు. మురుగునీరు చేరి కలుషితమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. కాలనీలో ఉన్న పాఠశాలకు పక్కా భవనం నిర్మించాలని కోరారు. సంబంధిత అధికారులు స్పందించి మైనారిటీ కాలనీలో పర్యటించి రోడ్లు, కాలువలు నిర్మించి, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. **కోసిగి** మండలం దొడ్డి బెళగల్ గ్రామంలో గ్రామంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. సచివాలయం ప్రాంతంలో సౌల్ గిరిలో సిసి రోడ్లు, డ్రైయినేజీ కాలువలు నిర్మించాలని సిపిఎం మండల నాయకులు రాముడు, వీరేష్ డిమాండ్ చేశారు. సిసి రోడ్లు, డ్రైయినేజీ లేకపోవడంతో వర్షాకాలంలో వర్షపునీరు, కొండనీరు ఇళ్లలోకి చేరి ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు యాత్ర దృష్టికి తెచ్చారు. సిపిఎం నాయకులు హనుమంతు, నాగేంద్ర, వీరేష్, తాయన్న పాల్గొన్నారు.



దేవనకొండలో మాట్లాడుతున్న నాయకులు



ఆదోని మండలం పెద్దతుంబలంలో...


ఆదోనిలో సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు



కోసిగిలో చైతన్య యాత్ర నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

రాయలసీమకు 40 శాతం నిధులు కేటాయించాలి

- రాయలసీమ విద్యావంతుల వేదిక సభ్యులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్ర బడ్జెట్‌లో రాయలసీమకు 40 శాతం నిధులు కేటాయించాలని రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు నాగన్న, ఆదినారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం రాయలసీమ ప్రాజెక్టుల సాధన సమితి, విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎన్‌జిఒ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ అభివృద్ధిపై గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వేదవతి, ఆర్‌డిఎస్ కుడికాలువ, గుండ్రేవుల ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని కోరారు. వాగులు, వంకలు, కాలువల అనుసంధానంతో చెరువులను అభివృద్ధి చేయాలని తెలిపారు. విభజన హామీలు అమలు చేయాలని, గుంతకల్ రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గాజులదిన్నె ప్రాజెక్టు ముంపు గ్రామాల రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, తుంగభద్ర దిగువ కాలువ ఆయకట్టు స్థిరీకరణ ఏర్పాటు చేయాలని కోరారు. వేదవతి సాధన కమిటీ కన్వీనర్ ఆదినారాయణ రెడ్డి, పందికోన రిజర్వాయర్ సాధన సమితి అధ్యక్షులు శేషాద్రి రెడ్డి, రామకృష్ణారెడ్డి, కెఆర్.రాఘవరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రత్నం, ఏసేపు, రాయలసీమ విద్యావంతుల వేదిక అధ్యక్షులు, ఎల్ఎల్‌సి ఆయకట్టు స్థిరీకరణ కన్వీనర్ నాగన్న, ఎపిడిఎస్ నాయకులు స్వామిదాస్, పిడిఎస్‌ఒ నాయకులు వీర ప్రతాప్, ఆర్‌వివిఎఫ్ నాయకులు కృష్ణ, వెంకటేష్, బీసీ సంఘ నాయకులు గణేష్, బతకన్న, సిపిఐ నాయకులు రంగన్న, పంపనగౌడ్, భాస్కర్ యాదవ్, సిపిఐ ఎంఎల్ నాయకులు రాజు, సత్తన్న, ప్రసాద్, హనీఫ్, ఏసేపు, రైతులు శ్యామ్సన్, బజారి, ఎలకన్న, నరసన్న, రంగన్న, రాజు, మాల మహానాడు నరసప్ప, రాజోలప్ప పాల్గొన్నారు.


గోడపత్రికలను విడుదల చేస్తున్న రాయలసీమ విద్యావంతుల వేదిక సభ్యులు

తిమ్మాపురంలో గడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మండలంలోని కె.తిమ్మాపురం గ్రామంలో రైతులు కురువ పేట నాగరాజు, తురక ఖాజావలీకి చెందిన గడ్డివాములు ప్రమాదవశాత్తు దగ్ధమాయ్యాయి. అగ్నిప్రమాదం జరిగి దాదాపు రూ.40 వేల ఆస్తి నష్టం జరిగినట్లు ఫైర్ స్టేషన్ ఆఫీసర్ జి.రామాంజనేయులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గుర్తు తెలియని వ్యక్తులు బీడీలు తాగి పడేసినట్లు అక్కడ ఉన్న రైతులు చెప్పారని అన్నారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో పెను ప్రమాదం తప్పిందని తెలిపారు. ఫైర్ సిబ్బంది ఎం.నాగరాజు, వై.గోపాల్ పాల్గొన్నారు.


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

హోలీ సంబరాలు

ప్రజాశక్తి - మంత్రాలయం

హోలీ పండగ సందర్భంగా పిల్లలు, పెద్దలు రంగులు చల్లుకుంటూ కేరింతలతో సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం హోలీ పండగ సందర్భంగా మంత్రాలయంలో రంగులు చల్లుకొని మహిళలు, యువత, చిన్న, పెద్ద తేడా లేకుండా సంబరాలు చేసుకున్నారు. రంగులు వేసుకుంటూ చేసిన హంగామాతో గ్రామంలోని వాడవాడలా రహదారులు రంగులమయంగా మారాయి.


సంబరాలు చేసుకుంటున్న మహిళలు

చైర్మన్‌పై అవిశ్వాసం..?

- **మున్సిపల్ చైర్మన్ బోయ శాంతపై అవిశ్వాసానికి కౌన్సిలర్లు సిద్ధం..!**
- **ఈనెల 17తో ముగుస్తున్న నాలుగేళ్ల కాలం**
- **చైర్మన్ రేసులో లోకేశ్వరి**

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో రాజకీయ పరిస్థితి మారుతోంది. ఈనెల 17తో మున్సిపల్ చైర్మన్ శాంత పదవి కాలం నాలుగేళ్లు అవుతోంది. మున్సిపల్ చట్టం ప్రకారం చైర్మన్‌ను మార్చాలంటే నాలుగేళ్ల వరకు సాధ్యం పడదు. ఈనెల 17తో నాలుగేళ్ల కాలం పూర్తి కానుండడంతో ప్రస్తుత చైర్మన్ బోయ శాంతపై వైసిపి కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కలెక్టర్‌ను కలిసి చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిసింది. ప్రస్తుత చైర్మన్ శాంత పదవిని కాపాడుకునే పరిస్థితి ఉంది. తనకు తానే రాజీనామా చేస్తారా లేదా అవిశ్వాసం ఎదుర్కొని దిగిపోతారా అన్నది అంతు పట్టడం లేదు.

ప్రస్తుతం ఆదోని మున్సిపాలిటీలో 42 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇటీవలే వైసిపికి చెందిన 24వ వార్డు కౌన్సిలర్ నాగలక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ప్రస్తుతం 41 మంది ఉన్నారు. అందులో టిడిపి ఒకరు, వైసిపి నుంచి రాజీనామా చేసి ఎమ్మెల్యే పార్థసారథి చెంతన చేరిన వారు ఐదుగురు, 35 మంది వైసిపి కౌన్సిలర్లు ఉన్నారు. వైసిపి కౌన్సిలర్ల మద్దతుతో చైర్మన్ అయిన శాంత, ఆమె భర్త నాగేంద్ర ప్రస్తుతం బిజెపిలో ఉన్నారు. ఆమెను పదవి నుంచి దింపేయాలని వైసిపి కౌన్సిలర్లు ఏకమయినట్లు తెలిసింది. ఇప్పటికే 42వ వార్డు కౌన్సిలర్ లోకేశ్వరి చైర్మన్ రేసులో ఉన్నట్లు సమాచారం.

వేడెక్కిన రాజకీయం

ఆదోనిలో మున్సిపల్ రాజకీయం వేడెక్కింది. వైసిపి నుంచి మున్సిపల్ చైర్మన్‌గా కొనసాగుతున్న బోయ శాంత పదవీకాలం (నాలుగేళ్లు) పూర్తి కానుంది. ఆమెపై వైసిపి కౌన్సిలర్లే అవిశ్వాస తీర్మానానికి సిద్ధమవుతున్నారు. ఈనెల 17తో శాంత చైర్మన్ పదవి కాలం పూర్తి కానుండడంతో అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు అవకాశం ఏర్పడింది. ఈ అవకాశాన్ని ఎలాగైనా సద్వినియోగం చేసుకోవాలని, ఛైర్మన్ శాంతను పదవి నుంచి దింపాలని కౌన్సిలర్లు 8 నెలలుగా ఎదురుచూస్తున్నారు. అనేకసార్లు ఛైర్మన్ రాజీనామా చేయాలని ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. అందుకు శాంత ఒప్పుకోకపోవడం.. పదవి కాలం పూర్తి కానుండడంతో అవిశ్వాస తీర్మానానికి వైసిపి కౌన్సిలర్లు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలిసింది. ఛైర్మన్ పదవిని గత ఎన్నో ఏళ్లుగా ఆశిస్తున్న వైసిపి సీనియర్ నాయకులు సిహెచ్.నాగరాజు తన సతీమణి, 42వ వార్డు కౌన్సిలర్ సిహెచ్.లోకేశ్వరిని ఛైర్మన్ చేయాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. 2021లోనే ఛైర్మన్ ఎన్నికల సమయంలో శాంతకు, లోకేశ్వరికి ఐదేళ్ల ఛైర్మన్ పదవి కాలంలో ఇద్దరికీ సరి సమానంగా ఇస్తామని అప్పటి ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మాట ఇచ్చినట్లు సమాచారం. అప్పటినుంచి పదవిని ఆశిస్తున్న నాగరాజు ఇప్పుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఇప్పటికే వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఆశీస్సులు పొందడమే కాకుండా కౌన్సిల్‌లో ఉన్న 40 మంది కౌన్సిలర్లలో మెజార్టీ కౌన్సిలర్లు సుమారు 35 మంది మద్దతు కూడా నాగరాజు సాధించినట్లు సమాచారం. ఇప్పటికే నాగరాజు తన రాజకీయ అనుభవంతో తన సహచరులతో కలిసి చక్రం తిప్పి ఛైర్మన్‌గా తన భార్య లోకేశ్వరిని ఏకగ్రీవం ఎన్నుకునే విధంగా రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం వైసిపి కౌన్సిలర్లు పెట్టే అవిశ్వాస తీర్మానం నెగ్గకుండా ఎమ్మెల్యే పార్థసారథి ఛైర్మన్ బోయ శాంతకు సహకరిస్తారని, ఇందుకోసం ఇప్పటికే ఐదుగురు వైసిపి కౌన్సిలర్లను బిజెపిలో చేర్పించుకున్నట్లు సమాచారం. అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే కనీసం 28 మంది కౌన్సిలర్ల మద్దతు ఉండాలి. ఇప్పటికే వైసిపి కౌన్సిలర్లకు 35 మంది మద్దతు ఉంది. మ్యాజిక్ ఫిగర్‌కు ఇంకా ఏడుగురు కౌన్సిలర్లు అదనంగా ఉండడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గడం ఖాయమని వైసిపి కౌన్సిలర్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 18న కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మానం కోసం నోటీసు ఇస్తామని వైసిపి కౌన్సిలర్లు చెబుతున్నారు. నోటీసు ఇచ్చిన 7 లేదా 15 రోజుల్లో ఛైర్మన్ తన బలాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుంది. బల పరీక్ష కోసం మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. బలపరీక్ష నిరూపణను ఆలస్యం చేసేందుకు ప్రయత్నం చేస్తే కోర్టును కూడా ఆశ్రయించేందుకు వైసిపి కౌన్సిలర్లు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం కుర్చీని నిలబెట్టుకునే పరిస్థితులు బోయ శాంతకు లేవని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. గౌరవం నిలబెట్టుకోవాలంటే ముందుగానే రాజీనామా చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



నీటిశుద్ధి కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని జాలమంచి గ్రామంలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నీటిశుద్ధి కేంద్రం ఏర్పాటు చేశారు. మహిళా దినోత్సవ వార్షికోత్సవ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన గుడిసె ఆది కృష్ణమ్మ, సర్పంచి తిక్కమ్మ, ఎంపిటిసి సరోజమ్మ ప్రారంభించారు. శుక్రవారం వారు మాట్లాడారు. గ్రామస్తుల కోసం నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్వచ్ఛమైన తాగునీరు, సురక్షితమైన నీటిని సరఫరా చేయడానికి వారు ముందుకొచ్చారన్నారు. నీటి శుద్ధి కేంద్రం పంచాయతీ ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టిడిపి నాయకులు గోవిందు, బంగారు, హుస్సేనిపాల్గొన్నారు.

విశాఖ ఉక్కును కాపాడుకుందాం

- ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అజయ్‌బాబు



నిరసన చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రంలో ఉన్న డబుల్ ఇంజిన్ సర్కార్ విశాఖ కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అజయ్ బాబు విమర్శించారు. శుక్రవారం ఏరియా హాస్పిటల్ రోడ్డులో ఎఐటియుసి పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వెంకన్న ఆధ్వర్యంలో రాస్తారోకో చేసి నిరసన చేపట్టారు. ఎఐటియుసి జిల్లా సమితి సభ్యులు కల్లుబావి రాజు, సి.హుస్సేని, ఎస్.షేక్షావలీ, ఫర్టిలైజర్ హమాలీ సంఘం నాయకులు దేవా, నరసింహులు, ఈరన్న, శ్రీరాములు, హనుమంతు, నాగరాజు, సిద్ధరామయ్య పాల్గొన్నారు.

తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు రంగస్వామి, పవన్ కోరారు. శుక్రవారం వారు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలలో నాడు - నేడు కింద చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణం ఇంతవరకు పూర్తి కాలేదని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా నిర్మాణాలు వేగవంతమైతాయంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పాఠశాలలో సుమారు 1,400 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. వారందరికీ ఇబ్బంది లేకుండా అధికారులు స్పందించి అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు.

వైసిపి మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కౌతాళం


పాల్ దినకరన్

కౌతాళం మండలంలో వైసిపి మండల కమిటీని శుక్రవారం ప్రకటించారు. ఇప్పటికే మండల కన్వీనర్‌గా దేశాయి ప్రహ్లాద చారి ఎన్నికైన విషయం తెలిసిందే. ప్రస్తుతం మండల ఉపాధ్యక్షులుగా హాల్వి చెన్నప్ప, సుధాకర్ రెడ్డి (రౌడూర్), జనరల్ సెక్రటరీగా నరసప్ప (తోవి), లింగన్న గౌడ్ (నదిచాగి), ఇద్రుస్ బాష (కౌతాళం), ప్రకాష్ (కాత్రికి), కార్యదర్శులుగా రమేష్, గురునాథ్ రెడ్డి, నీలకంఠ రెడ్డి, ధర్మన్న, లింగన్న గౌడ్, ట్రెజరర్‌గా రాఘవేంద్ర రెడ్డి, సభ్యులుగా పాల్ దినకరన్, భీమేష్, రామస్వామి, సిద్ధేష్, శ్రీకాంత్, శివారెడ్డి, లింగ, నర్సారెడ్డి, గోవిందు, ఆదినారాయణ రెడ్డి, ఉలిగప్ప, నరసింహులును ప్రకటించారు. ఇందులో మండలంలోని వివిధ గ్రామాల్లో అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకొని ప్రకటించినట్లు నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డి కుటుంబానికి రుణపడి ఉంటామని, పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.


ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు